# కామాగ్ని'కీల'ర్

ఇద్దరు వ్యక్తుల మధ్య శృంగారం పూర్తిగా వ్యక్తిగత వ్యవహారం, పరస్పర ఆనందదాయకం. అయితే అది అక్రమసంబంధం అయితే చాలా సందర్భాల్లో నేరానికి దారి తీస్తుంది. వాళ్లు సాధారణ వ్యక్తులైతే జిల్లా ఎడిషన్‌లో ఓ మూల పడుతుంది. అదే ప్రజల తలరాతలు మార్చగలిగిన నేతలైతే హెడ్‌లైన్స్‌కి ఎక్కుతుంది. ఎందుకంటే యీ శృంగార కార్యకలాపం అవినీతి, బంధుప్రీతి, దుష్టరక్షణ, దేశద్రోహం వంటి నేరాలకు దారి తీసే అవకాశం వుంది కనుక !

1961లో బ్రిటన్ యుద్ధశాఖ మంత్రి ఒక హై క్లాసు వేశ్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకున్న అనేకమంది ప్రియులలో లండన్‌లోని రష్యన్ రాయబార కార్యాలయంలో నావల్ ఎటాచీ పనిచేస్తున్నట్టు కనబడే రష్యన్ గూఢచారి కూడా వున్నాడు. ఆ వేశ్యను వీరందరికీ పరిచయం చేసిన ప్రముఖవ్యక్తి కూడా కమ్యూనిస్టు సానుభూతిపరుడే. అనుకోకుండా 1963లో జరిగిన ఓ సంఘటన ద్వారా ఈ కనక్షన్ బయటపడింది. బ్రిటన్ రాజకీయ రహస్యాలు ఆ వేశ్యద్వారా రష్యన్ గూఢచారికి, తద్వారా రష్యాప్రభుత్వానికి అంది వుంటాయని గగ్గోలు పుట్టింది. ఆ మంత్రి చేత రాజీనామా చేయించి ఓ ఎంక్వయిరీ కమిషన్ వేసింది బ్రిటన్ ప్రభుత్వం. శృంగారమూ, రాజకీయమూ ఎలా పెనవేసుకుని పోయాయో అందరికీ తెలిసివచ్చింది. క్రిస్టిన్ కీలర్ అనే ఆ హై క్లాసు వేశ్య కథ చరిత్ర కెక్కింది.



కీలర్ హై క్లాసు వేశ్యగా పుట్టలేదు. ఆమెను ఆ స్థాయికి తెచ్చిన ఘనత డా॥ స్టీఫెన్ వార్డ్‌ది. కీలర్ ఒక పేద కుటుంబంలో పుట్టి, పొట్టపోసుకోవడానికి లండన్ చేరింది. మోడల్‌గా, (పక్కన ఫోటో చూడండి) రెస్టారెంట్లలో వెయిట్రస్‌గా, అర్ధనగ్ననృత్యాలు చేసే కాబరే నర్తకిగా పొట్టపోసుకుంటూ వుండేది. ఆమె అందానికి ఆకర్షితులైన వారిలో డా॥ వార్డ్ ఒకడు. ఇలాటి అనాథలను కొన్ని రాత్రులైనా సనాథలను చేసే 'కార్యం' నెత్తిన వేసుకున్న వార్డ్ వృత్తిరీత్యా ఆస్టియోపత్ (ఎముకల వైద్యుడు). ప్రవృత్తి రీత్యా చిత్రకారుడు. వైద్యుడిగా అతని పేషంట్లలో చర్చిల్, ఎలిజిబత్ టేలర్ వంటి ప్రముఖులున్నారు. చిత్రకారుడిగా అతని చేత బొమ్మలేయించుకున్న వారిలో రాచకుటుంబీకులు, మంత్రులు వున్నారు. ఇది పైకి అందరికీ తెలిసిన జీవితం.

అయితే అతనికి మరో జీవితం కూడా వుంది. భార్యతో విడిపోయిన తర్వాత వేశ్యలతో తిరిగేవాడు. వాళ్లని చేరదీసేవాడు. బ్రిడ్జి ఆట ఆడడానికి యింటికి పిలిచిన అతిథులకు సేవ చేయడానికి వారిని నియోగించేవాడు. 1959లో వార్డ్ కీలర్‌ను కలిసేనాటికి అతని వయసు 50, ఆమె వయసు 17. ఆమెను చేరదీసి రాక్‌మన్ అనే మాదకద్రవ్యాల వ్యాపారికి అప్పచెప్పాడు. రాక్‌మన్ కీలర్‌కి ఒక ఫ్లాట్ ఏర్పాటు చేశాడు. కానీ ఆమె అతనొక్కణ్నే నమ్ముకుని కూచోదలచుకోలేదు. చాలా ఫ్లాట్స్‌నూ, అంతకంటె ఎక్కువమంది మగాళ్లను మార్చింది. కానీ వార్డ్‌తో సాన్నిహిత్యాన్ని మాత్రం కొనసాగించింది. వార్డ్ ఆమెను కొత్తకొత్తవారికి పరిచయం చేస్తూ పోయాడు.



1961 వేసవిలో వార్డ్ మిత్రుడు లార్డ్ ఏస్టర్ ఎస్టేటులో ఓ పార్టీ జరిగింది. అక్కడ కీలర్‌ను యిద్దరు ముఖ్యులకు వార్డ్ పరిచయం చేశాడు. ఒకడు 48 ఏళ్ల జాక్ ప్రొఫ్యూమో. బ్రిటన్ యుద్ధశాఖామాత్యుడు. మరొకడు - రష్యన్ ఎంబసీలో నావల్ ఎటాచీ యూజీన్ ఇవనోవ్. (పక్కన ఫోటో) వయసు 35 కీలర్ తన ప్రేమను యిద్దరికీ పంచింది. కొన్ని రోజులు పోయాక లార్డ్ ఏస్టర్ కీలర్ గాడ్‌ఫాదరైన వార్డ్‌కి ఫోన్ చేసి ప్రొఫ్యూమోకు కీలర్ పిచ్చిపిచ్చిగా నచ్చేసిందని, మరింత తరచుగా కలుద్దామనుకుంటున్నాడనీ చెప్పాడు. ఓకే అన్నాడు వార్డ్. కీలర్‌కి, ప్రొఫ్యూమోకు బంధం మరింత గట్టిపడింది. మంత్రిగారిపై బ్రిటిషు గూఢచారుల నిఘా ఎలాగూ వుంటుంది కదా. వాళ్లు కీలర్‌పైన, వార్డ్ యింటిపైనా ఓ కన్ను వేసి వుంచారు. కీలర్ యింటికి ఆమె మరో ప్రియుడు ఇవనోవ్ వచ్చిపోతూ వుండడం వారిని కలవరపరిచింది. నిఘా మరింత పెంచారు.

ఇది వార్డ్ దృష్టికి వచ్చింది. కీలర్ తన యిల్లు వదిలిపోతే యీ గూఢచారుల పీడ వదులుతుంది కదా అనుకున్నాడు. నిజానికి అతనికి, కీలర్‌కు శారీరక సంబంధం లేదుట. ('మాది అన్నాచెల్లెళ్ల బంధం' అంది కీలర్) వార్డ్‌కి నచ్చిన అమ్మాయిలను ఒప్పించి తీసుకురావడం కీలర్ బాధ్యత. వార్డ్ యింట్లో సామూహిక శృంగారయాగాలు (ఆర్గీ) జరిగేవి. అతని యింట్లో ఒక విచిత్రమైన అద్దం వుంది. దాని ద్వారా పక్కగదిలో జరిగే రతికేళి వారికి తెలియకుండా చూడవచ్చు. ఫోటోలు తీయవచ్చు. అది పెట్టించినవాడు రాక్‌మన్.



కీలర్ ఒకప్పటి కీలర్ కాదు. రాక్‌మన్ పుణ్యమాని ఆమెకు మాదకద్రవ్యాలు అలవాటు పడ్డాయి. వాటితో బాటు వాటిని సరఫరా చేసే వెస్ట్ ఇండియన్ల (మన హైదరాబాదీలకు నైజీరియన్లలా) తో సాంగత్యమూ అలవాటయింది. ప్రొఫ్యూమోతో సంబంధం మొదలయ్యేక కీలర్ క్లబ్బుల్లో అర్ధనగ్న ప్రదర్శనలు యివ్వడం మళ్లీ మొదలుపెట్టింది. అక్కడ సాటి డాన్సర్ మేర్లిన్

రైస్ డేవిస్ (మ్యాడీ అని ముద్దుపేరు)తో స్నేహం కుదిరింది. మ్యాడీది కూడా కీలర్ బాటే. (పక్కన ఫోటో) చాలామందితో కలిసి తిరిగేది. వారిలో వార్డ్ ఒకడు. ఇద్దరూ కలిసి ఓ యింట్లో వుండేవారు. లార్డ్ ఏస్టర్ కీలర్ కోసం ఏర్పాటు చేసిన యిల్లది. కొన్నిరోజులకు కీలర్ మ్యాడీని తన పాతప్రియుడు, మాదకద్రవ్యాల వ్యాపారి ఐన రాక్‌మన్‌కు పరిచయం చేసింది. వాళ్లిద్దరి మధ్య బంధం గట్టిపడి మ్యాడీ అతని ఫ్లాట్‌కి మారిపోయింది.

వెస్ట్ యిండియన్ క్లబ్బులు, డ్రగ్స్, శాడిస్టులు – వీటి చుట్టూ కీలర్ జీవితం పరిభ్రమించింది. లక్కీ గార్డన్ అనే నీగ్రో గాయకుడితో, జాన్ ఎడ్జ్‌కూంబ్ అనే మరో వెస్ట్ ఇండియన్‌తో ఒకేసారి ప్రేమాయణం సాగించింది. కొన్నాళ్లకు ఎడ్జ్‌కూంబ్‌తో విసుగెత్తి అతన్ని వదిలిపెట్టేసింది. దాంతో అతనికి తిక్కరేగి ఓ రాత్రి తుపాకీ జేబులో పెట్టుకుని కీలర్ అప్పట్లో నివసిస్తున్న వార్డ్ ఫ్లాట్ కెళ్లి ఏడుసార్లు కాల్చాడు. ఎవరూ గాయపడకపోయినా చట్టవిరుద్ధంగా తుపాకీ ఉపయోగించినందుకు అతన్ని అరెస్టు చేశారు పోలీసులు. కోర్టులో కేసు నడిచింది.



ప్రాసిక్యూషన్ తరపు ముఖ్యసాక్షి క్రిస్టిన్ కీలర్. కానీ ఆమె కోర్టుకి హాజరు కాలేదు. పోలీసులామెను పట్టి తేలేదేమని పత్రికలు ప్రశ్నించాయి. కీలర్‌కు, ప్రొఫ్యూమోకు అక్రమ సంబంధం నడుస్తున్నట్లు పుకార్లు బయటకి వచ్చాయి. సంధానకర్త వార్డ్ అయివుండవచ్చని కూడా అనుకున్నారు – అతని యింటిమీద కాల్పులు జరిగేయి కాబట్టి ! తీగలాగితే డొంకంతా కదిలింది. రంకు రచ్చకెక్కింది. రాజకీయవేత్తల రంగు బయటపడింది. 'ది డైరీ స్కెచ్' అనే పత్రిక మ్యాడీని వెతికి పట్టుకుంది. ఆమె తన గురించి, కీలర్ గురించి, ప్రొఫ్యూమో గురించి, ఇవనోవ్ గురించి అన్నీ బయటకు కక్కేసింది.

1963 మార్చిలో హౌస్ ఆఫ్ కామర్స్‌లో ప్రొఫ్యూమోను నిలదీశారు ప్రతిపక్షాలవారు. సమాధానంగా అతను "కీలర్‌ను 1961 డిసెంబరులో చివరిసారిగా చూశానంతే, ఇప్పుడెక్కడుందో తెలియదు. నా భార్యా, నేనూ (ప్రొఫ్యూమో, అతని భార్య ఫోటో పక్కన చూడండి) ఆమెను 1961 జులైలో మొదటిసారిగా కలిశాం. తరువాత ఆమెను అరడజను సార్లు డా॥వార్డ్ యింట్లో చూశాను. మా యిద్దరి మధ్య అనుచితమైన సంబంధం ఏమీ లేదు. మా గురించి దుష్ప్రచారం చేస్తున్నవారిపై పరువునష్టం దావా వేయడానికి నేను వెనుకాడను." అని గంభీరమైన స్టేటుమెంటు యిచ్చాడు.



ఇక అందరూ చల్లబడ్డారు. పొరబాటు పడ్డామేమో అనుకున్నారు. ఇది వార్డ్‌కి నచ్చలేదు. ప్రొఫ్యూమో పెద్దమనిషిగానూ, తను వేశ్యావ్యాపారం చేసే భ్రష్టుడిగానూ పేరు రావడం అతనికి కోపం తెప్పించింది. ఈ ఇమేజి వలన అతని వద్దకు పెద్దమనుషులు రావడం మానేశారు. ఈ వార్డ్ ప్రొఫ్యూమోను అన్యాయంగా యిరికించినట్టే తమనూ యిరికిస్తాడని భయపడసాగారు. ప్రొఫ్యూమోను బయటపెట్టడమొకటే దీనికి మందు అనుకున్నాడు వార్డ్. అప్పటి బ్రిటన్ ప్రధానమంత్రి మాక్మిలన్ దగ్గరకి వెళ్లి కథంతా చెప్పేశాడు. దాని ప్రకారం –

"లార్డ్ ఏస్టర్ 1961 జులై 8 న పార్టీకి వార్డ్, కీలర్ మరి కొంతమంది అమ్మాయిలతో హాజరయ్యాడు. స్విమ్మింగ్‌పూల్‌లో కలిసి స్నానాలు చేశారు. (పక్కన ఫోటో – కీలర్, యితర అమ్మాయిల మధ్య వార్డ్) కీలర్ స్నానం చేస్తూ మధ్యలో బట్టలిప్పేసి గట్టుమీదకు విసిరేసి, నగ్నంగా స్నానం చేయడం మొదలెట్టింది. లార్డ్ ఏస్టర్, ప్రొఫ్యూమో అటువైపు నడుచుకుంటూ వచ్చారు. కీలర్ నీళ్లలోంచి బయటకు వచ్చి బట్టలు తీసుకోవడానికి పరుగు పెట్టింది. ఆమెను ఏడిపించడానికి వార్డ్ ఆ బట్టల్ని మరో మూలకు విసిరేశాడు. కీలర్ తన అటు పరిగెట్టబోతూ ఒళ్లు దాచుకోవడానికి ఓ తువ్వాలు దొరకబుచ్చుకుని కప్పుకోబోయింది. సరిగ్గా ఆ క్షణంలో ప్రొఫ్యూమో ఆమెను చూశాడు. చూసిన క్షణంలోనే మోహించాడు. (ఫోటో – తువ్వాలుతో కీలర్)

మర్నాడు అందరూ మళ్లీ పార్టీ చేసుకున్నారు. అమ్మాయిలతో జలకాలాడినవారిలో ప్రొఫ్యూమో, ఇవనోవ్ కూడా వున్నారు. ఆ తర్వాత లార్డ్ ఏస్టర్ ద్వారా వార్డ్‌కి కబురు పెట్టి ప్రొఫ్యూమో కీలర్ కోసం అతని యింటికి వచ్చేవాడు. ఒకవేళ ఎవరైనా యింట్లో వుంటే అప్పటిదాకా కీలర్‌ను కార్లో తిప్పి తీసుకుని వచ్చి గది ఖాళీ అయ్యాక అప్పుడు దూరేవాడు. ఓ సారి మంత్రి అని రాసి వున్న కారులో కూడా యీ వేశ్యతో కలిసి తిరిగేడు. ప్రొఫ్యూమో కీలర్‌తో కులుకుతూంటే వార్డ్ మ్యాడీతో పక్కగదిలో క్రీడించేవాడు.

ప్రొఫ్యూమో, ఇవనోవ్ ఇద్దరూ ఒకే అమ్మాయితో తిరగడం వలన కలత చెందిన సెక్యూరిటీ సర్వీసెస్ చీఫ్ 1962 ఆగస్టులో



కాబినెట్ సెక్రటరీని కలిశాడు. ఆయన ప్రొఫ్యూమో దగ్గరకు వెళ్లి "నీకు ఇవనోవ్ తెలుసుట కదా, అతను మన తరఫు గూఢచారిగా మారి రష్యా రహస్యాలు మనకు చెపుతాడేమో కనుక్కో." అని అడిగాడు. ఇలా అడగ్గానే ప్రొఫ్యూమోకు భయం వేసింది – ఇవనోవ్‌కు, తనకు మధ్య కీలర్ వున్న విషయం సెక్యూరిటీ వాళ్లకు తెలిసిపోయిందేమోనని. వెంటనే కీలర్‌కు ఓ ఉత్తరం రాసి పంపాడు – 'డార్లింగ్, సెప్టెంబరు దాకా నిన్ను చూడడానికి వీలుపడదు." అని.

ఇదంతా గతం. ఇప్పుడు వార్డ్ ప్రధాని మాక్మిలన్‌ను కలిసి విషయమంతా చెప్పేశాడని వినగానే ప్రొఫ్యూమో గతిలేక 1963 జూన్ 4 న మంత్రిపదవికి రాజీనామా చేశాడు. కానీ దానితో మంటలు చల్లారలేదు. ప్రధానిపై ప్రతిపక్షాలు అస్త్రాలు ఎక్కుపెట్టాయి. రక్షణరహస్యాలు రష్యాపాలవుతుంటే ప్రధాని ఏం చేస్తున్నారని నిలదీశాయి. దాంతో జూన్ 21 న ప్రభుత్వం లార్డ్ డెనింగ్ అనే ఆయన అధ్యక్షతన ఓ విచారణ కమిషన్ వేశారు. ఆయన సెప్టెంబరులో తన నివేదిక సమర్పిస్తూ "డా॥ వార్డ్ రష్యా సానుభూతిపరుడే. ఇవనోవ్ గూఢచారే ! కానీ అతనికీ కీలర్‌కు మధ్య శారీరక సంబంధం లేదు. ప్రొఫ్యూమోకు, కీలర్‌కు మధ్య అక్రమసంబంధం వుంది కానీ ప్రొఫ్యూమో నుండి బ్రిటన్ తాలూకు రక్షణరహస్యాలు రాబట్టమని వార్డ్ కీలర్‌ను ఎప్పుడూ అడగలేదు. ఆమె రాబట్టనూ లేదు, ఇవనోవ్‌కు యివ్వనూ లేదు. ఎందుకంటే అతను ఆమె ప్రియుడు కాడు. బ్రిటన్ భద్రతా రహస్యాలు భద్రంగానే వున్నాయి." అని అన్నారు.

దీన్ని నమ్మినవారు నమ్మారు. నమ్మనివారు నమ్మలేదు. బ్రిటన్ రహస్యాలు ఒక వేశ్యద్వారా రష్యాకు చేరిపోయాయని బయటపడితే దేశానికే నగుబాటుగా వుంటుందని కమిషన్ యిలా చెప్పిందని అనుకున్నారు వారు. ఈ లోపున 1963 జులైలో వేశ్యావ్యాపారం చేశాడంటూ డా॥ వార్డ్‌పై ప్రభుత్వం కేసు నడిపింది. దేశభద్రతకు హాని కలిగించాడని మాత్రం ఆరోపించలేదు, అది ఎక్కడకు దారి తీస్తుందోనన్న భయమేమో. కీలర్‌తో సహా అందరూ సాక్ష్యాలిచ్చారు. ప్రముఖుల శృంగార జీవితాలు బజారు కెక్కాయి. కేసు ముగియకముందే డా. వార్డ్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. కీలర్ మాత్రం తన కథని పత్రికలకు అమ్ముకుని బాగా డబ్బు సంపాదించింది. తర్వాతి రోజుల్లో కీలర్ లాటి వాళ్లు చాలామందే పుట్టుకుని వచ్చారు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**